క్లుప్తంగా

కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న కానిస్టేబుల్ తదితరులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులకు దసరా పండుగ పురస్కరించుకొని మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జనార్దన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించి దసరా పండుగ కానుకగా దుస్తులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రభు, వీరన్న పాల్గొన్నారు.

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి దసరా పర్వదినాన్ని పురస్కరించుకున నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో వారి సేవలు విలువకట్టలేనివన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): భారీవర్షాలకు అల్లాదుర్గం బట్టికుంట చెరువుకు గండిపడింది. దీంతో గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతమయంగా మారింది. అలాగే రోడ్డుపై వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు పడ్డారు. రోడ్డుపై నీరు ప్రవహించడం గుంతలు ఏర్పడి మట్టి పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో స్పందించిన అధికారులు తాత్కాలిక రోడ్డు మరమ్మతులు మంగళవారం చేపట్టారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నర్సాపూర్: తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 25 మంది లబ్ధిదారులకు రూ.3.60 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, ప్రసాద్, భిక్షపతి, ఆంజనేయులుగౌడ్ ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల్లో ఏర్పడే రక్తహీనత గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడంతోనే మహిళలు ఆర్యోగంగా ఉండటంతో పాటు రక్తహీనత నుంచి కాపాడుకోవచ్చునని డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. కూరగాయలు, పప్పుదినుసులు, గుడ్లు వంటి ఆహార పదార్థాలను భుజించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మృదుల, సూపర్‌వైజర్ శైనీసువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, స్వర్ణలత, పద్మ, వాణి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జాగిలాలతో తనిఖీలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం బాంబ్ డిస్పోజల్ టీమ్ ఎస్‌ఐ రాజేశ్ ఆధ్వర్యంలో పలు దుకాణాలు తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని పాన్‌షాపులు, కిరాణ దుకాణాలు, బస్టాండ్, దాబాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజేశ్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై పరికరాలు

అల్లాదుర్గం(మెదక్): 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ పరికరాలు నాప్సర్ స్ప్రేయర్, రోటోవిటర్, కేజీవీల్ తదితర పరికరాలు రాయితీపై అందజేయనున్నట్లు చెప్పారు. రైతులు పూర్తి వివరాలకు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు బైక్ వేలం

నర్సాపూర్: ఓ కేసులో పట్టుబడిన ఓ బైక్‌ను 25న తమ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా మంగళవారం చెప్పారు. బైక్ ధర సుమారుగా రూ.80 వేలుగా నిర్ణయించామని, ఆసక్తి గల వారు రూ. 20 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సీఐ కోరారు.

గాయత్రీ దేవిగా దర్శనం

జిల్లాలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలువైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రెండో రోజు అమ్మవారు భక్తులకు గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.



నర్సాపూర్: గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న రేణుక ఎల్లమ్మ



శివ్వంపేట: గోమారంలో దుర్గామాతకు పూజలు



అల్లాదుర్గం: ముస్లాపూర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



నిజాంపేటలో గాయత్రి మాత దర్శనం



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో గాయత్రీదేవిగా దుర్గామాత దర్శనం



హవేళిఘణాపూర్: తొగిటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చేగుంటలో అమ్మవారికి పూజలను నిర్వహిస్తున్న భక్తులు



పెద్దశంకరంపేట: కట్టెలవెంకటాపూర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



తూప్రాన్: గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

ప్రతివ్యక్తి స్వచ్ఛభారత్‌లో పాల్గొనాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

మెదక్‌జోన్: ప్రతివ్యక్తి స్వచ్ఛభారత్‌లో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని పలువీధుల్లో ఉన్న ముళ్లపొదలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, పల్లెలు పరిశుభ్రంగా ఉన్నాయంటే కేంద్రం నిధులే కారణమన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో చెత్తను తొలగిస్తున్న బీజేపీ నేతలు

ఎన్‌ఎస్‌ఎస్ శ్రమదానం

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ యూనిట్ -1 ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం శ్రమదానం చేశారు. గ్రామంలో డ్రైనేజీలు శుభ్రం చేశారు. రోడ్లపక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఐదు రోజుల నుంచి గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేపట్టడంతోపాటు, ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

బీమా చేసి.. ధీమాగా ఉండండి

రేగోడ్(మెదక్): టీజీబీలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా చేసి ధీమాగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేశ్ కుమార్ కోరారు. మండలంలోని మర్పల్లికి చెందిన హరికృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే హరికృష్ణ స్థానిక బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా చేయడం వలన ఆయన కుటుంబానికి రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును అందజేసి, తండ్రి జనార్దన్ ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో ఉన్న ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేగోడ్ టీజీబీలో రూ.100 కోట్ల బిజినెస్ ఉందని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అజయ్ కుమార్, మహేశ్వర్ గౌడ్, మర్పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మేనేజర్ రాజేశ్‌కుమార్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నార్సింగి వైద్యాధికారి డాక్టర్ రేఖ

చిన్నశంకరంపేట(మెదక్): స్వస్థినారీ ఆరోగ్య శిబిరాలను మహిళలు సదినియోగం చేసుకోవాలని నార్సింగి వైద్యాధికారి డాక్టర్ రేఖ కోరారు. మంగళవారం నార్సింగి పీహెచ్‌సీలో మహిళల కోసం గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ శిల్పారెడ్డి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు అవసరమైన మందులు అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. మహిళలు ప్రత్యేక వైద్య శిబిరాలకు హాజరై తమ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు.

ఉచిత మెగా పశువైద్య శిబిరం

తూప్రాన్: మండలంలోని యావాపూర్‌లో సత్య సాయి ట్రస్ట్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా ఫెర్టిలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్ వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పాడి పశువులలో పునరుత్పత్తి సమస్యలు ఏర్పడితే పాడి రైతుల లాభనష్టాలలో ప్రభావితం చేస్తాయని తెలిపారు.



కౌల్దారంలో పోషకాహారం కిట్లను అందజేస్తున్న రాజిరెడ్డి

సంక్షేమానికి పెద్దపీట

కౌల్దారం(నర్సాపూర్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం కౌల్దారం, ఎనగండ్ల, రంగంపేట గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన సొంత నిధులతో బాలింతలకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. సీఎంఆర్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి, పుట్టబోయే బిడ్డల శారీరక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు శేఖర్ రెడ్డి,వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక మోడల్ స్కూల్‌లో ఒకేషనల్ కోర్సుపై ప్రిన్సిపాల్ శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటర్‌షిప్ శిక్షణలో భాగంగా స్థానిక శ్రీదుర్గా ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్‌లో ఒకేషనల్ ఉపాధ్యాయుడు సంతోష్ మంగళవారం శిక్షణ ఇచ్చారు. చదువుతోపాటు ఒకేషనల్ కోర్సుల ద్వారా ఉపాధి పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు భద్రం తదితరులున్నారు.

జగదాంబ అమ్మవారికి బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బద్యాతండా, సామ్లా తండాల గిరిజనులు శ్రీజగదాంబ అమ్మవారి బోనాల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో, చిన్నారులు, యువకులు, గిరిజన మహిళల సాంప్రదాయ నృత్యాల మధ్యన అమ్మవారికి బోనాల ఊరేగింపు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆమె పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, యూత్ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బుజ్జిబాయి, దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి, ముకుందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందించనున్నట్లు దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మండలం వల్లూర్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. వల్లూర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన లబ్ధిదారుల ఇళ్లను ఆయన ప్రారంభించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

విజేత జట్లకు ప్రోత్సాహకం

మూడు స్థానాలు గెలుచుకున్న మండల జట్లు



షీల్డ్‌తో పాటు చెక్కును అందుకుంటున్న ఇబ్రహీంపూర్ క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీల్లో చేగుంట మండల జట్లు మూడు స్థానాల్లో గెలుపు సాధించినట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ తెలిపారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేట మోడల్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ఇబ్రహీంపూర్ జట్టు మొదటి స్థానం 70 వేలు నగదు ప్రోత్సాహకం, చేగుంట పట్టణ జట్టు ద్వితీయ స్థానం 40 వేల నగదు, వడియారం గ్రామ జట్టు తృతీయ స్థానం 25 వేల నగదు ప్రోత్సాహకం గెలుచుకొని శ్రవణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నారు.



రవీందర్‌చారిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

వాలీబాల్ రాష్ట్ర కమిటీలో మండలవాసికి చోటు

శివంపేట(నర్సాపూర్): వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో మండలంలోని బిజిలీపూర్‌కు చెందిన వ్యక్తికి చోటు లభించింది. ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రాష్ట్రకమిటీ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న బిజిలీపూర్ వాసి కమ్మరి రవీందర్‌చారి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యాడు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పరంజ్యోతి, సభ్యులు సాయిరాం, కృష్ణ, రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహిపాల్ తదితరులు రవీందర్‌చారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.

తడి, పొడి చెత్త, ప్లాస్టిక్‌పై అవగాహన

నర్సాపూర్: ప్లాస్టిక్ వాడడంతో కలిగే అనర్థాల గురించి నాలుగో వార్డు ప్రజలకు మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్ మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధించిందని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని చెత్త విభజనపై అవగాహన కల్పించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మున్సిపల్ సిబ్బంది ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ సిబ్బంది మురళి, ఉదయ్‌కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పోషణపై ప్రయాణికులకు అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సిబ్బంది

నర్సాపూర్: పోషణ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ఐసీడీఎస్ అధికారులు స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు పోషణ ఆహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ హేమభార్గవి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు కవిత, సరళకుమారి, లక్ష్మీనర్సమ్మలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు ప్రకృతిలో దొరికే 40రకాల ఆకు కూరలను బస్టాండులో ప్రదర్శనకు పెట్టి వాటిని తినడంతో కలిగే ప్రయోజనాలను బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులకు వివరించి వాటి పట్ల అవగాహన కల్పించారు. సేంద్రియ సాగుతో పండించిన ఆకుకూరలు తినాలని వారు వివరించారు. కాగా బస్సులలో ఉన్న ప్రయాణికులకు సైతం పోషణపై చెప్పి అవగాహన కల్పించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని, ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు లక్ష్మి, ఖమర్‌సుల్తాన తెలిపారు. మంగళవారం కౌడిపల్లి ఐకేపీ మండల సమాఖ్య సమావేశంలో పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకుకూరలలో అనేక పోషకాలు ఉంటాయని, తప్పనిసరిగా ఆహారంలో ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పోషన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంగీత, మండల సమాఖ్య అధ్యక్షురాలు పుణ్యమ్మ, కార్యదర్శి రాధిక, ఐకేపీ సీసీలు, మండల సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.